# పాపం రజియా

అది 1980 జనవరి ఒకటవ తారీకు సాయంకాలం. లక్నో నుంచి బయలుదేరిన విమానం ఢిల్లీ పాలం ఎయిర్ పోర్టులో అయిదున్నర గంటలకి దిగింది. అందులో నుంచి ప్రయాణీకులందరూ దిగి లౌంజ్‌లో తమ తమ సామాను కొరకు ఎదురు చూస్తున్నారు. దాదాపు 35 సంవత్సరాల వయసులో వున్న ఒక స్త్రీ మాటిమాటికి తన చేతి గడియారం కేసి చూసుకుంటున్నది.

తన బ్రీఫ్‌కేసు రాగానే అందుకొని గబగబా బయటికి వచ్చి ఒక టాక్సీలో కూర్చుంది. కొంత గాభరా, కొంత అనిశ్చిత స్థితి ఆమె ముఖంలో కదులుతున్నాయి.

ఆ స్త్రీ ఎవరు?

ఆమె ఎక్కడికి వెళ్తూంది?

ఎందుకంత వ్యాకులపాటు చెందుతోంది?

*            *            *

ఆమె పేరు రజియా హుసేన్.

ఆమె అఫ్సర్ హుసేన్, ఐ. ఎ. ఎస్. సతీమణి. అఫ్సర్ హుసేన్ అప్పుడు టూరిజం డైరెక్టరుగా వున్నాడు.

భర్త చెప్పిన ప్రకారం ఆమె రెండవ తేదీన తన ముగ్గురు పిల్లలతో ఢిల్లీకి రావాలి. కాని ఒక రోజు ముందే వంటరిగా వచ్చింది. ఒక్క రోజు ముందు రావడం తన జీవితానికే శాపంగా పరిణమిస్తుందని ఆమె ఊహించలేదు.

*   *   /   *

హొటల్ అంబాసిడర్ ముందు టాక్సీ దిగి పోర్టికోలో ప్రవేశించిన రజియా యు టి ఆర్ 4418 నెంబరులో వున్న కారు కన్పించింది. దానిమీద "డైరెక్టర్ యు. పి. టూరిజం." అని బోర్డు కూడా వున్నది. అది చూడగానే డాక్టర్ రజియాకు కనుబొమ్మలు ముడిపడ్డాయి. వస్తున్న కోపాన్ని అణచుకుంటూ బ్రీఫ్‌కేస్ చేతుల్లో పట్టుకుని హొటల్ రిసెప్షన్ కౌంటరు దగ్గరకు వెళ్ళి, రూం నెంబరు 323లో వున్న వాళ్లు గదిలోనే వున్నారా?" అని అడిగింది.

"అవును మేడమ్! ఫోన్లో మాట్లాడతారా?" అనడిగాడు రిసెప్షనిష్టు.

"నో! నో! వాళ్ళు నాకోసం ఎదురు చూస్తూవే వుంటారు!" అని రజియా ముందుకు కదిలింది. లిఫ్టుకి కూడా ఎదురు చూడకుండా గబగబా మెట్లెక్కి 323 గది ముందు నిల్చుంది. తలుపు హేండిల్ తిప్పగానే తలుపు తెరుచుకుంది. లోపల గడియ పెట్టిలేదు. గదిలో ప్రవేశించిన రజియా ఎదురుగా కన్పిస్తున్న దృశ్యాన్ని చూస్తూ స్థాణువులా ఉండిపోయింది. మంచం మీద ఒక పురుషుడు, ఒక స్త్రీ కన్పించారు. ఆ పురుషుడు అఫ్సర్ హుసేన్. ఆమె అతని ఆఫీసులో రిసెప్షనిష్టు. పాతికేళ్ళ వీనాకౌర్.

రజియాను చూస్తూనే అఫ్సర్ హుసేన్, నీనా గాభరాగా మంచం దిగారు. పక్కనే వున్న నైట్‌గౌన్ అందుకని తగిలించుకుంది నీనా. అఫ్సర్ హుసేన్ రాతి బొమ్మలా నిలబడిపోయాడు.

రజియా పిచ్చిదానిలా అరవసాగింది.

"నీకు సిగ్గులేదూ? ఇంతచదువు చదివావు! ఇంత పెద్దఉద్యోగం చేస్తున్నావు. నీలాంటి వాళ్ళు ముక్కు మూసుకుని మూడు నిముషాల్లో చావవచ్చు. సిగ్గూశరం విడిచేసిన వాడివి!" అంటూ నీనా వైపు తిరిగి "నేను మీ మీద మినిష్టర్‌కి కంప్లెయింట్ ఇస్తాను! యూ బిచ్"అంది.

అఫ్సర్ హుసేన్ కొంత తేరుకుని, 'నోర్ముయ్! ఇక్కడ సీన్ క్రియేట్ చేశావా చంపేస్తాను!'' అంటూ తన బ్రీఫ్‌కేస్ తెరవడానికి వంగాడు.

* * *

అప్పుడు సాయంత్రం ఏడవుతుంది. నైట్‌గౌన్‌లో వున్న నీనా గాభరాగా రిసెప్షన్ కౌంటర్లోకి వచ్చి, ''నా గెస్ట్ జబ్బుగా వున్నాడు. దయచేసి వెంటనే డాక్టర్ని పిలవండి" అన్నది.

ఆ సమయంలో ఆ హెూటల్లో డాక్టరెవరూ లేరు. టాక్సీకోసం ఫోన్ చేశారు హాస్పిటల్‌కి తీసుకువెళ్ళవచ్చునే ఉద్దేశ్యంతో.

అదే సమయంలో రజియా కిందకి వచ్చి ఇంగ్లీషులో "ఏమిటిది? ఒక మనిషికి జబ్బుగా ఉందంటే ఎవరూ పట్టించుకోరు?" అంటూ పిచ్చిగా అరవసాగింది.

ఆమె కేకలకు అందరూ పరిగెత్తుకొని వచ్చారు. అందరూ రూం నెంబరు 323 గదిలోకి ప్రవేశించారు. గదిలో చుట్టిన దుప్పట్లో

ఒక వ్యక్తి పడి వున్నాడు. అక్కడక్కడ రక్తపు మరకలు కన్పిస్తున్నాయి. ఆ రక్తపు మరకలు చూసి అందరూ చిన్నగా జారుకున్నారు.

రజియా అర్థం చేసుకుంది, ఇంక తనకు ఎవ్వరూ సహాయం చేయరని. ఒక సర్వరు సహాయంతో దుప్పట్లో చుట్టివున్న భర్తను మోస్తూ మెల్లిగా కిందకు దిగి వచ్చింది. అప్పటికే టాక్సీ వచ్చింది. భర్తను వెనుక సీట్లో పడుకోబెట్టి రామమనోహర్ లోహియా ఆస్పత్రికి తీసుకు వెళ్లింది.

నీనా గదిలోనే వుండిపోయింది. తలుపు గడియ పెట్టుకుంది.

ఆస్పత్రిలో డాక్టర్లు అఫ్సర్ హుసేన్ మరణించినట్టు చెప్పారు. "లేదు లేదు! ఇంకా ప్రాణం ఉంది. ఇంజక్షన్ ఇవ్వండి. కార్డియాక్ మసాజ్ చెయ్యండి" అంది డాక్టర్ రజియా కంగారుగా.

ఆమెమీద గౌరవంతో డాక్టర్లు ఆమె చెప్పినట్లుచేశారు. అయినా లాభం లేకపోయింది. రజియా తన స్నేహితురాలు డాక్టర్ అక్తర్‌కు ఫోన్ చేసింది. అక్తర్ వచ్చి పరీక్షించి తల వంచేచుకుంది. రజియాను ఓదార్చుతూ తనింటికి తీసుకువెడతానన్నది. రజియా తన అడ్రసు, ఢిల్లీలోని డాక్టర్ అక్తర్ అడ్రసు ఇచ్చి స్నేహితురాల్తో బయలుదేరింది. పిచ్చిదాన్లా విలపిస్తున్న ఆమెను ఓదార్చలేక అక్తర్ నిద్ర మందు ఇచ్చింది.

ఎవరు అతన్ని పిస్టల్‌తో కాల్చారో ఎవరికీ తెలియలేదు. కాని పోలీసు ఎంక్వయిరీలో తను తన అన్నకి ఫోన్ చెయ్యడానికి కిందికి వచ్చినప్పుడు గదిలో పిస్టల్ పేలిన శబ్దం వినిపించిందనీ, వెంటనే తను గదిలోకి పరిగెత్తుకు వెళ్ళానని, అపటికే అఫ్సర్ హుసేన్ నేల

మీద పడి వున్నాడనీ, ఛాతీలో ఎడం పక్కనుంచి రక్తం కారుతుందని చెప్పింది రజియా.

"ఒక డాక్టరుగా వెంటనే నాకర్తవ్యాన్ని నేను నిర్వహించాను! బెడ్‌మీద వున్న దుప్పటిని తీసి శరీరానికి చుట్టి, గాయంలోంచి వస్తున్న రక్తాన్ని ఆపటానికి ప్రయత్నించాను. కార్డియాక్ మసాజ్ ఇచ్చాను. అప్పటికే ఆయన కళ్ళు మూసుకుపోయినై! వెంటనే నీనాతో డాక్టరుని పిలవమన్నాను. తరువాత నేనే హాస్పిటల్‌కి తీసుకెళ్ళాను" అని చెప్పింది రజియా.

నీనా తలుపు లోపల్నుంచి వేసుకున్న తరువాత మళ్ళీ బయటికి రావడం ఎవరూ చూడలేదు. రూం నెం. 323కి ఎన్నో ఫోన్లు వచ్చినా జవాబేమీ లేకపోవడంవల్ల హెూటలు వాళ్ళకి అనుమానం వచ్చి పోలీసులకి ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి తలుపులు బద్దలు కొట్టారు. లోపల నైట్‌గౌనులో వున్న నీనా నేలమీద రక్తపు మడుగులో బోర్లా పడి వున్నది. ఈమె మృతి కూడా సందేహాస్పదంగా, చిక్కు ప్రశ్నగానే కనిపించింది. గదిలో సామానంతా చిందర వందరగా వుంది. రెండు దుప్పట్లు నేలమీద పడివున్నాయి. టేబులు మీద ఒక సీసా, ఒక ప్లేట్లో సగం తిన్న మటన్ కట్‌లెట్ ఉన్నాయి. అక్కడే సగానికి వున్న సోడా బాటిల్ వున్నది. పక్కనే స్కాచ్ విస్కీ బాటిల్ వుంది.

మంచం మీదా, సోఫా మీదా కూడా రక్తపు మరకలు. నీనా శవం పక్కనే పిస్టల్ పడివుంది. ఆ పిస్టల్‌లో ఉండవలసిన మూడు బుల్లెట్స్‌లో రెండు లేవు. బల్లమీద ఒక చిన్న కాగితం ముక్క వుంది. ఆ కాగితంలో-'నేను చెప్పడానికి ఏమీ లేదు-నీనా-'అని రాసి వుంది తారీకు మాత్రం రెండవ తేదీ జనవరి నెల వేసివుంది. ఇక్కడ ఒక విషయం వివరించవలసి వుంది. అఫ్సర్ హుసేన్ జనవరి ఒకటవ

తారీకు సాయంత్రం చనిపోయాడు. రజియా అతన్ని తీసుకుని హాస్పిటల్‌కు వెళ్ళిపోయింది. వెంటనే నీనా తలుపులు వేసుకుంది.

రెండో తారీకు వేసి ఉందంటే బహుశా నీనా రాత్రి పన్నెండు గంటల తరువాత ఆ ఉత్తరం రాసి వుండాలి. కాని సాయంకాలం నుంచీ వస్తున్న ఫోన్లకి ఆమె ఎందుకు జవాబు ఇవ్వలేదు? 7 గంటల నుంచీ రాత్రి పన్నెండు గంటల వరకూ ఆమె గదిలో ఏం చేస్తోంది? ఈమధ్య సమయంలో ఆమె బయటికి వెళ్లిందా? ఈ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వగలిగింది నీనా ఒక్కతే.

* * *

పోలీసులు అఫ్సర్ హుసేన్, నీనాల శవాలను 48 గంటల తరవాత పోస్టుమార్టం కోసం పంపించారు. పోస్టుమార్టం రిపోర్టు ప్రకారం హుసేన్‌కు ఒకటి నుంచి మూడు అడుగుల దూరం నుంచి గుండు తగిలింది. నీనాకి మాత్రం చాలా దగ్గర్నుంచి (క్లోజ్‌రేంజ్‌లో) తగిలింది.

అఫ్సర్ హుసేన్ శవాన్ని అలీఘర్ తీసుకొచ్చారు. నీనా అంత్యక్రియలు మాత్రం తల్లి దండ్రుల సమక్షంలో ఢిల్లీలోని ఎలక్ట్రిక్ క్రిమేటోరియంలో జరిగాయి.

## హుసేన్ - రజియా

రజియా అలీఘడ్ యూనివర్శిటీలో ఇంజనీర్‌గా పనిచేస్తున్న అబ్దుల్ జబర్‌ఖాన్ కుమార్తె. ఉన్నత కుటుంబానికి చెందిన రజియా సహజంగానే సంస్కారవతి. అలీఘడ్ యూనివర్శిటీలో రజియా ఇంటర్ చదువుతున్నప్పుడు హుసేన్ బి. యస్. సి. చదువుతూ వుండేవాడు.

వారివురి స్నేహాన్ని గురించి యూనివర్శిటీ మొత్తం తెలుసు. కాని వారి వివాహానికి రెండు కుటుంబాల వాళ్ళూ సుముఖంగా లేరు. రజియా సున్నీ కుటుంబానికే చెందితే, హుసేన్ షియా శాఖకు చెందినవాడు. బీద కుటుంబం నుంచి వచ్చి, స్కాలర్‌షిప్ మీద చదువుతున్న వాడు. అతను బి. యస్. సి. పూర్తిచేసి సైన్యంలో మేజర్‌గా చేరాడు.

రజియా 1968లో ఢిల్లీలో ఎం. బి. బి. ఎస్. పూర్తి చేసింది. మరుసంవత్సరం హుసేన్‌తో ఆమె వివాహం అలీఘడ్‌లో జరిగింది. సైన్యంలో పనిచేస్తూనే అఫ్సర్ ఐ. ఎ. ఎస్. పరీక్ష రాసి ప్రథముడిగా ఎన్నికయ్యాడు. 1967లో ఉత్తర ప్రదేశ్‌లో సబ్-కలెక్టరుగా చేరాడు. 1979లో టూరిజం డైరెక్టరుగా ఛార్జి తీసుకున్నాడు. రజియా లక్నో ఆసుపత్రిలో మెడికల్ ఆఫీసరుగా పనిచేస్తున్నది. వారికి ఇద్దరు ఆడ పిల్లలు, ఒక మగపిల్లవాడు. పెద్ద పిల్ల వయసు పది సంవత్సరాలు.

హుసేన్‌కు సెక్సు బలహీనత వున్నది. అందమైన, చదువుకున్న భార్య వున్నా అతను తన మనసును అదుపులో పెట్టుకోలేకపోయాడు. ఆడపిల్ల అందుబాటులో ఉంటే చాలు-వదిలేవాడు కాదు. పెద్ద హెూదాలో ఉన్నవాడికి అవకాశాలు చాలా వుంటాయి. పైగా తాగుడు, ధూమపానం అలవాట్లు వున్నాయి.

హుసేన్‌కు నౌకాయానం అంటే ఇష్టం. అందులో మంచి ప్రావీణ్యతను సంపాదించాడు. 1970లో బ్యాంకాక్‌లో జరిగిన ఏషియన్ గేమ్స్‌లో పాల్గొని నౌకాయానం పందెంలో తామ్ర పతకాన్ని పొందాడు. 1978లో శ్రీలంకలో జరిగిన దక్షిణ ఏషియన్ గేమ్స్‌లో వెండి పతకాన్ని పొందాడు.

అతను సుల్తాన్‌పూర్‌లో పనిచేస్తున్నప్పుడు ఒక వేశ్య అతని మీద కేసు పెట్టింది. ఆ కేసును మాఫీ చేసినా, అక్కడ అతనికి చాలా చెడ్డపేరు వచ్చింది.

కాశ్మీర్‌లోనూ ఒకసారి ఇలాంటి గొడవలో చిక్కుకున్నాడు. ఇలాంటి విషయాలు విని విని రజియా విసిగిపోయి ఒకరోజు నిద్ర మాత్రలు మింగింది. కాని సుల్తాన్‌పూర్ ఆసుపత్రిలో ఆమెకు చికిత్స జరిగింది.

## నీనా గత చరిత్ర

నీనా చామనచాయ రంగులో ఆకర్షణీయంగానే ఉంటుంది. అయితే రజియా సొగసు, అందం ముందు అమె తేలికగా ఓడిపోతుంది. ఆమె టూరిజం డిపార్టుమెంట్‌లో రిసెప్షనిస్టుగా పని చేస్తున్నది. ఆమె వయసు 26 సంవత్సరాలు. నీనాకు అనేకమంది ఆఫీసర్స్‌తో పరిచయం కాసాగింది. పెద్ద పెద్ద అధికారుల్ని సైతం ఆమె కనుసైగల మీద ఆడించేదట.

ఆ విషయం తెలిసిన తండ్రి నీనా వివాహం చేశాడు. నెల తిరగక ముందే నీనా విషయం తెలిసిన ఆమె భర్త ఆమెను వదిలేశాడు. నీనాకు కావల్సింది కూడా అదే.

1979లో హుసేన్ ఉత్తరప్రదేశ్ టూరిజం డైరెక్టరుగావచ్చాడు. నీనాను చూశాడు. తనతో టూర్స్‌కు నీనాను తీసుకెళ్లేవాడు.

1979 డిసెంబరు 29వ తేదీన ఆఫీసు పనిమీద బొంబాయి వెళ్ళవలసి వున్నది. ఆగ్రాలో "లైట్ - అండ్ - సౌండ్" ప్రోగ్రాంను ప్రవేశపెట్టే విషయంలో ప్రముఖ సినీ డైరెక్టర్ శ్యాంబెనెగల్‌ను కలుసు

కోవడానికే అతడు బొంబాయి ప్రయాణం పెట్టుకున్నాడు. రజియాతో బొంబాయి నుంచి జనవరి ఒకటి సాయంత్రానికి తాను ఢిల్లీ వెళతానని, పిల్లల్ని తీసుకొని రెండవ తేదీన ఆమె వస్తే 5వ తేదీ వరకూ ఢిల్లీలో గడపవచ్చునీ చెప్పి ప్రయాణం అయ్యాడు. కానీ హుసేన్ డిసెంబరు 29న నీనాతో కలిసి బొంబాయికి సరాసరి కాక ఢిల్లీకి బయలుదేరాడు. ముందుగావే హొటల్ అంబాసిడర్‌లో గది బుక్ చేయించిన నీనా రెండు గంటల ముందుగా వచ్చి హొటల్ గది తాళం తీసుకుంది. ఆమె తన పేరు కుమారి డి. షాహ్‌గా సంతకం చేసింది. తర్వాత నీనా అతిథిగా హుసేన్ హొటల్‌కు వచ్చాడు. అతిథులు రాత్రి 11 గంటల తర్వాత హొటల్లో వుండకూడదు. కాని హుసేన్ లాంటి పెద్ద పదవిలో వున్న వ్యక్తిని హొటల్ వెళ్లిపొమ్మని చెప్పలేకపోయింది. ఇద్దరూ జనవరి 1వ తేదీ వరకు అదే హొటల్లో వుండిపోయారు. అతనికి బొంబాయి ప్రయాణం గురించిన ఆలోచన కూడా రాలేదు. జనవరి ఒకటి మధ్యాహ్నం హుసేన్ ఢిల్లీ టూరిజం డిపార్టుమెంటుకు వెళ్ళి ఆఫీసు కారు అడిగి తెచ్చుకున్నాడు. రజియా వచ్చేసరికి పోర్టికోలో కనిపించిన కారు అదే.

ఇంతలో, ఉత్తరప్రదేశ్ టూరిజం శాఖ మినిష్టర్‌కు డైరెక్టర్‌తో పని పడింది. అది డిసెంబరు 30వ తేదీ. ఆఫీసువాళ్ళు బొంబాయి, ఢిల్లీ ఫోన్లు చేశారు. రెండు చోట్లనుంచీ అతను రాలేదని సమాధానం వచ్చింది. ఇంటికి ఫోన్‌చేసి రజియా నుంచి హుసేన్ ఆచూకి తెలుసుకోవడానికి ప్రయత్నించారు. ఆమె బొంబాయి టూర్ వెళ్ళాడని చెప్పింది. అప్పుడు ఆఫీసువాళ్ళు హుసేన్ అక్కడకు వెళ్ళలేదని తమకు తెలిసిందన్నారు.

రజియా బుర్రను అనుమానం పురుగులా తొలచసాగింది. నీనా

కూడా 29వ తేదీన ఊరికి వెళ్ళిందని తెలిసింది. ఆమె నీనా ఇంటికి వెళ్లింది. రజియా, నీనా తండ్రితో మాట్లాడుతుండగా అతనికి ఢిల్లీ నుంచి ట్రంకాల్ వచ్చింది.

"అరే నీనా నువ్వా? ఢిల్లీ అంబాసిడర్ హెూటల్ నుంచి ఎవరో మాట్లాడతారంటే భయపడిపోయాను సుమా!" అంటూ ఏదేదో మాట్లాడి వచ్చాడాయన.

అది రజియా విన్నది. "ఎవరి నుంచి ఫోన్?" అని అడిగింది.

"నీనా చేసింది. ఢిల్లీలో అంబాసిడర్ హెూటల్ రూం 20లో వున్నదట." అన్నాడు నీనా తండ్రి.

కొంతసేపు అతనితో పిచ్చాపాటీ మాట్లాడి ఇంటికి వచ్చింది. ఆ తెల్లవారే ఒంటరిగా బయలుదేరి విమానంలో ఢిల్లీ చేరుకుంది.

భర్త చనిపోయాక రజియా మతిభ్రమించినట్టు ప్రవర్తించ సాగింది. డాక్టర్ అక్తర్ ఆమెను ఆసుపత్రిలో చేర్పించింది.

పోలీసువారు ఆమెను ఎన్నో ప్రశ్నించాలని వచ్చారు. కాని ఆమె సమాధానాలు చెప్పే మానసిక స్థితిలో లేదు.

ఆమె కొంచెం కుదుట పడ్డాక పోలీసుల ప్రశ్నలను ఎదుర్కోవలసి వచ్చింది. ఆమె ఏడ్వడం తప్ప ఒక్కదానికి సరైన సమాధానం ఇవ్వలేదు.

చివరకు భర్తను హత్య చేసింది ఆమేనని పోలీసులు ఒక నిర్ణయానికి వచ్చారు. ఆమె ప్రస్తుతం జైలులో వున్నది. కోర్టులో కేసు నడుస్తున్నది.